
నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 25 నవంబర్ 2024 | NAGARKURNOOL

## కొత్త ఉద్యోగులకు జీతాలెప్పుడో..!


Model Appointment orders for Mandal Parishad / Zilla Parishad
PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER & MEMBER SECRETARY:: DSC-2024 WANAPARTHY DISTRICT.

అక్టోబర్ 10న జారీ చేసిన ఉపాధ్యాయ ఉద్యోగ నియామక ఉత్తర్వు

- రెండు నియామక ఉత్తర్వులతో గడబిడ
- అక్టోబర్ 10 నుంచే పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్న ఉపాధ్యాయులు
- ప్రాన్ నెంబర్ల జారీలో ఆలస్యం
- నవంబర్ దాటుతున్నా వేతనాలపై స్పష్టతరాని వైనం

వనపర్తి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కొత్తగా ఉపాధ్యాయులకు అక్టోబర్ 9న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉద్యోగ నియామక పత్రాలు అందించిన విషయం విధితమే. జిల్లాలో దాదాపు 150 మంది వరకు నూతన ఉపాధ్యాయులుగా విధుల్లో చేరారు. అయితే.. ఆ ఉద్యోగులందరికీ జీతాలు ఎప్పుడొస్తాయో అంతుబట్టడం లేదు. గత నెలలో విధుల్లో చేరగా ఇప్పటి వరకు వారి వేతనాలకు సంబంధించిన కార్యాచరణ కనిపించడం లేదు. దీంతో జిల్లా పరిధిలో పనిచేస్తున్న కొత్త ఉపాధ్యాయులు వేతనాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

**ఉత్తర్వుల్లో వివాదం..**

హైదరాబాద్‌లో అక్టోబర్ 9న ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఎం చేతుల మీదుగా 10వ తేదీతో ఉపాధ్యాయ నియామక పత్రాలను నూతన ఉపాధ్యాయులకు అందజేశారు. అయితే పాఠశాలలో జాయిన్ అయిన తేదీ అంటూ మళ్లీ డీఈవో అక్టోబర్ 16వ తేదీన మరో నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఇలా రెండు ఉత్తర్వులు ఇవ్వడంతో కొత్త వేతనాలను ఏ తేదీ నుంచి లెక్కలోకి తీసుకోవాలనే విషయంలో గందరగోళం నెలకొంది. కొలువుల్లో చేరిన ఉద్యోగులు వేతనాల కోసం గంపెడాశతోఎదురు చూస్తున్నారు. ఇలా రెండు ఉత్తర్వులు ఇవ్వడంపై ప్రభుత్వానికి క్లారిటీ కోసం మళ్లీ ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి ఏదో ఒక తేదీని ప్రకటిస్తే తప్పా వేతనాలు చేయలేని పరిస్థితి ఉంది. ఇదిలా ఉంటే.. గతంలోనే పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అక్టోబర్ 10నుంచే వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు సైతం ఇచ్చారు. దీనిపై ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇవ్వనందునా కొత్త ఉద్యోగుల వేతనాలు పెండింగ్‌లో పడ్డాయి. లేదంటే అక్టోబర్ 16నుంచి వేతనాలు చేసుకోవాలనుకునే వారు మాత్రం ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూడాల్సిన పనిలేదు. ప్రభుత్వం ముందు చెప్పి ఉత్తర్వులు ఇచ్చినందునా అక్టోబర్ 10 నుంచి వేతనాలను పరిగణలోకి తీసుకోవాలని కొత్త ఉద్యోగులంతా అడుగుతున్నారు.

**ప్రతి నెలా 25లోపే..**

ప్రభుత్వ పాఠశాలల్లో వేతనాలకు సంబంధించి ప్రతి నెలా 25 తేదీలోపు ఫైల్స్‌ను సిద్ధం చేసి పంపిస్తారు. ఈ లెక్కన ఈ నెలలో కూడా కొత్త వారికి వేతనాలు చేయాలంటే ఇక కేవలం 2 రోజులే మిగిలింది. ఇప్పటికే నెలలో చేయాల్సిన ఉపాధ్యాయుల వేతనాల ప్రక్రియను కొన్ని పాఠశాలల్లో ముగించారు. ఇంకా రెండు ఉత్తర్వులపై ప్రభుత్వం నుంచి స్పష్టత త్వరలో వస్తుందన్న నమ్మకం కూడా లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ కొలువులో చేరినా వేతనాలు అందడంలో గ్యారెంటీ లేనట్లుగా కొత్తఉద్యోగుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇలా అనేక గందరగోళాల మధ్య కొత్త ఉద్యోగులకు వేతనాలు ఎప్పుడు అందుతాయో వేచి చూడాల్సిందే మరీ.

**ప్రాన్ నెంబర్ల జారీలోనూ జాప్యం..**

కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ప్రతి ఒక్కరికీ ట్రెజరి కార్యాలయం నుంచి ఐడీ నెంబరు, ప్రాన్(పీఆర్ఏఎన్) నెంబర్లు ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగాల్లో చేరిన అనంతరం వీరు దరఖాస్తు ప్రాసెస్‌ను పూర్తి చేయగా, ఇటీవలే ఐడీ, ప్రాన్ నెంబర్లను జారీ చేశారు. ఐడీలు త్వరగా ఇచ్చినా ప్రాన్ నెంబర్ల జారీని చాలా రోజులు పెండింగ్‌లో ఉంచి జాప్యం చేశారు. డబ్బుల కోసమే ప్రాన్ నెంబరు ఇవ్వకుండా తాత్సారం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.500 ఇచ్చిన వారికి వెంటనే ఇచ్చారని, డబ్బులు ఇవ్వని వారికి అప్పుడు, ఇప్పుడంటూ దాటవేసినట్లు తెలిసింది. అయితే.. ప్రాన్ నెంబర్లకు లంచం అడుగుతున్నారన్న సమాచారం బయటకు తెలియడంతో పెండింగ్‌లో ఉన్న వాటిని చకాచకా పూర్తి చేయగా, సాంకేతిక లోపంతో ఉన్న దాదాపు పది దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. జిల్లాలో వనపర్తి, ఆత్మకూరులో ఎస్టీవో కార్యాలయాలుండగా మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాలు ఆత్మకూరు పరిధిలోకి వస్తాయి. మిగితా మండలాలన్నీ వనపర్తి ట్రెజరీ పరిధిలోకి వస్తాయి. ఐడీ నెంబర్ మాత్రం ప్రతి ఉద్యోగికి జిల్లా కోశాధికారి కార్యాలయం ద్వారానే కేటాయించడం జరుగుతుంది.

## ఏషియన్ నెట్‌బాల్‌లో సత్తాచాటాలి


క్రీడాకారులను అభినందిస్తున్న నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 24 : ఏషియన్ నెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటాలని ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏషియన్ నెట్‌బాల్ పోటీలకు ఆదివారం మొదటి దఫా ఎంపికలు నిర్వహించినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు, కార్యదర్శి విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి మహిళలు, పురుషుల 125మంది క్రీడాకారులు ఎంపిక కాగా.. వీరికి జనవరిలో శిక్షణ నిర్వహిస్తామన్నారు. అనంతరం కొరియా, దేశంలోని న్యూఢిల్లీలో జరిగే ఏషియన్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్, దేశ నెట్‌బాల్ సమాఖ్య అబ్జర్వర్ గాడ్సన్‌బాబు, నెట్‌బాల్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, సునిల్, కురుమూర్తిగౌడ్, రామ్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెలగని బటర్‌ఫ్లై లైట్లు





- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

మహబూబ్‌నగర్, నవంబర్ 24 : బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఎకో పార్కు నుంచి అప్పన్నపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని నెలలుగా ఎకో పార్కు నుంచి అప్పన్నపల్లి వరకు లైట్లు సక్రమంగా వెలగడం లేదు. చాలా వరకు లైట్లు వేసినట్లే అనిపించినా ఎప్పుడూ బ్లింక్ అవ్వడం, ఆరిపోవడం తప్పా పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతునారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు సక్రమంగా వెలిగేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

- సాయిరెడ్డి మరణవాంగ్మూలం నోట్‌ను పట్టించుకోని వైనం
- సీఎం సోదరులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి
- 108 బీఎన్ఎస్ సెక్షన్‌ను ఎందుకు చేర్చలేదు?
- అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- ప్రజలకు ఒకలా, సీఎం కుటుంబసభ్యులకు మరో న్యాయమా..?
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- దవాఖానలో బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ



సాయిరెడ్డి చిన్నకొడుకు మాధవరెడ్డితో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# పోలీసుల అత్యుత్సాహం


వెల్దండలో అంబేద్కర్‌కు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, నవంబర్ 24 : కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి మరణ వాంగ్మూలం నోట్ ఆధారంగా నిందితుల కాలమ్‌లో రేవంత్‌రెడ్డి సోదరుల పేర్లు చేర్చుతూ బీఎన్ఎస్ 108 సెక్షన్‌తో పాటు పీడీ యాక్ట్ నమోదు చేయాలని, ఈ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం కల్వకుర్తి ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖాన మార్చురీలో సాయిరెడ్డి పార్థివదేహంపై ఆర్ఎస్‌పీ పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాయిరెడ్డి చిన్న కుమారుడు మాధవరెడ్డికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దవాఖాన ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాయిరెడ్డి మరణ వాంగ్మూలం నోట్‌ను పక్కనబెట్టి సీఎం సోదరులపై ఈగ వాలకుండా కొమ్ము కాస్తున్న పోలీస్ అధికారులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుల తీరుతో అవమాన భారానికి గురై 85 ఏండ్ల వృద్ధుడు సాయిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటే.. నిందితుల కాలమ్ ఖాళీగా ఉంచి 108 బీఎన్ఎస్ సెక్షన్ ఊసే లేకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆశ్చర్యంగా ఉందని మండిపడ్డారు. తాను కూడా పోలీస్ అధికారిగా పనిచేశానని, చట్టం గురించి క్షుణ్ణంగా తెలుసునని, ఒక వ్యక్తి మరణ వాంగ్మూలం లేఖలో పేర్లు రాస్తే 108 బీఎన్ఎస్ సెక్షన్ నమోదు చేసి విచారణ చేయాల్సి ఉంటుందన్నారు. సాయిరెడ్డి నోట్‌ను పోలీసులు మాయం చేసి.. 108 బీఎన్ఎస్ సెక్షన్‌ను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రాజ్యాంగానికి, భారత న్యాయ సంహితకు విధేయత చూపాలి కానీ.. సీఎం, వారి కుటుంబ సభ్యులు, సోదరులకు కాదని హితవు పలికారు. రాష్ట్రంలో పోలీసుల తీరు ద్వంద వైఖరికి నిదర్శనంగా ఉందన్నారు. మరణ వాం గ్మూలం లేఖ తమ వద్ద లేదని పోలీసులు బుకాయిస్తున్నారని.., అలాంటప్పుడు సోషల్ మీడియాలో కనిపిస్తున్న లేఖ ఆధారంగానైనా కేసు నమోదు చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. అదే సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులు ఆధారంగా రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పార్క్‌లో జాగింగ్ చేస్తున్నప్పుడు బీఎన్ఎస్ 354, ఐటీ 67 సెక్షన్ కింద అరెస్ట్ చేయలేదా అంటూ దుయ్యబట్టారు. సీఎం కుటుంబానికి ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా అని పేర్కొన్నారు. సాయిరెడ్డి నోట్ పోలీసుల వద్దే ఉంచుకొని.. లేదంటూ కట్టుకథలు అల్లుతున్నారన్నారు. చిన్న చిన్న కేసుల్లో అత్యుత్సాహం ప్రదర్శించే పోలీసులు సాయిరెడ్డి విషయంలో 108 బీఎన్ఎస్ సెక్షన్ నమోదు చేయడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. మరణ వాంగ్మూ లం నోట్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించామని చెబుతూ నే నిందితులను తప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్న విషయం స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. సాయిరెడ్డి ఆత్మహత్య విషయంలో డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ ఆరేండ్లకు వస్తుందని, ఆ రిపోర్టు వచ్చిన తర్వాత 108 సెక్షన్ నమోదు చేసి విచారణ చేసే సమయానికి ఉండేదెవడో పోయేదెవడో అని ఎద్దేవా చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు పోలీసులు నిందితుల కాలమ్‌లో బీఎన్ఎస్ 108 సెక్షన్‌ను చేర్చి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియంతృత్వ, రాచరిక అనవాళ్లు కనిపిస్తున్నాయని, ప్రశ్నించే గొంతుకలను, అన్యాయాలను ఎదురించే వారిని నిర్బంధించడం, కేసులు నమోదు చేయడం సర్వసాధారణంగా మారిందన్నారు. రైతులను అష్టకష్టాలు పెడుతూనే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సీఎం సోదరులు రాజ్యాంగేతర శక్తులుగా మారి రాచరిక పోకడలు సాగిస్తున్నారని. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ కొండారెడ్డిపల్లిలో సాయిరెడ్డి ఆత్మహత్యే అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ హక్కులుంటాయని, వాటిని కాపాడేందుకు ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ నిలబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, విజయ్‌గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### సాయిరెడ్డి ఆత్మహత్యకు సీఎందే బాధ్యత

వెల్దండ, నవంబర్ 24 : కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహిస్తూ సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. వెల్దండ మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొండారెడ్డిపల్లి గ్రామానికి 13ఏండ్లు సుదీర్ఘ సేవలు అందించిన సాయిరెడ్డిని క్షోభకు గురి చేసి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన రేవంత్‌రెడ్డి సోదరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 85ఏండ్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరును తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టారాంరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ నాయకులు యాదగిరి, అశోక్, ఆర్కెగౌడ్, శ్రీను, జోగయ్య, వెంకట్‌రెడ్డి, ఆనంద్, హన్మంతు, లింగం, సాజ్యా, రాజు మాజీ ఉప సర్పంచులు నిరంజన్, నర్సింహ తదితరులు ఉన్నారు.


శ్రీశైలంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- క్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కార్తీకమాసం ఆఖరి వారం
- శివ నామస్మరణతో మార్మోగుతున్న శైవక్షేత్రం

## శ్రీశైలంలో కార్తీక సందడి

శ్రీశైలం నవంబర్ 24 : శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో క్షేత్రం సందడిగా మారింది. కార్తీకమాస శోభను సంతరించుకున్న శ్రీశైల మహాక్షేత్రం శివనామస్మరణతో మార్మోగుతుంది. కార్తీకమాసం ఆఖరివారం కావడంతోపాటు వారాంతపు సెలవులు కలిసిరావడంతో కుటుంబసమేతంగా క్షేత్రానికి చేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు తెల్లవారుజామునే తలనీలాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం, ఉత్తర మాడవీధి వద్ద దీపాలు వెలిగించుకొని పూజలు నిర్వహించారు.

**అందరికీ అలంకార దర్శనమే - ఈవో ఆజాద్**

భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చే యాత్రికుల సంఖ్య పెరుగుతూ ఉన్నందున రద్దీ రోజులలో స్వామి వారి గర్భాలయ అభిషేకాలు, స్పర్శ దర్శనాలు తాత్కాలికంగా రద్దు చేసి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అమ్మవారి అంతరాలయంలో జరిపించే కుంకుమార్చనలు కూడా ప్రాకార మండపంలోనే నిర్వహిస్తుండగా యాత్రికులు ఆలయ సిబ్బందితో సహకరించాలని ఈవో కోరారు.

**కిలో మీటర్లమేర ట్రాఫిక్ జాం..**

ఆదివారం మధ్యాహ్నం నుంచి తిరుగు ప్రయాణమైన వాహనాలతో సుమారు 10 కిలోమీటర్లమేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. హైదరాబాద్ రహదారివైపు నిలిచిపోయిన వాహనాలు క్లియర్ అవ్వడానికి నాలుగు గంటల సమయం పట్టింది. రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ ఆంక్షలు కఠినతరం చేశారు. టోల్‌గేట్ నుంచి వలయ రహదారి గుండా నిర్ణీత ప్రాంతాలకు వెళ్లవలసిందిగా సూచించారు. క్షేత్ర పురవీధుల్లోకి ప్రవేశించి అడ్డగోలుగా పార్కింగులు చేసి యాత్రికులకు ఇబ్బందులు కలిగించకుండా ఉండేలా పలు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రిస్తున్నట్లు శ్రీశైలం సీఐ తెలిపారు.

## కురుమూర్తి జాతరలో భక్తుడిపై ఎస్సై దాడి


గాయపడిన రాములు

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), నవంబర్ 24 : చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని పేదల తిరుపతిగా పేరు గాంచిన కురుమూర్తి జాతరకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ క్రమంలో జాతర ప్రాంగణంలోని రోడ్డులో భారీగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సరిచేయాల్సిన పోలీసులు జాతరకు వచ్చిన భక్తుడిపై దాడికి పాల్పడ్డారు. చింతకుంట మండలం ఫర్దీపూర్ గ్రామానికి చెందిన భక్తుడు చాకలి రాములుపై చింతకుంట స్టేషన్ ఎస్సై శేఖర్ ట్రాఫిక్ పేరుతో ఇష్టం వచ్చినట్లు కొట్టినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడిని జిల్లా దవాఖానకు తరలించినట్లు స్థానికులు, భక్తులు తెలిపారు. దేవుడి దర్శనానికి వచ్చిన భక్తులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు దాడులు చేయడం సరైన పద్ధతి కాదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై చింతకుంట స్టేషన్ ఎస్సైను వివరణ కోరగా, ఆదివారం జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వాహనాలను అడ్డదిడ్డంగా ఆపడంతో ట్రాఫిక్ క్లియర్ చేసే క్రమంలో అందరినీ చెదర కొట్టే ప్రయత్నంలో ఒకరికి ఒకరు తోసుకుంటూ వెళ్లారు.. తప్పా ఉద్దేశ పూర్వకంగా ఎవరిపైనా దాడి చేయలేదని ఎస్సై పేర్కొన్నారు.

- దోమలపెంటలో దాహం దాహం
- వారానికోసారి తాగునీటి సరఫరా
- మహిళలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


నల్లా నుంచి వచ్చే తాగునీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

## చెంతనే కృష్ణమ్మ అయినా తాగునీటికి చింత

దోమలపెంట, నవంబర్ 24 : అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట గ్రామస్తులు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. కృష్ణానది చెంతనే పారుతున్నా.. శ్రీశైలం ప్రాజెక్టు చేరువనే ఉన్నా.. నీటి కష్టాలు మాత్రం గ్రామాన్ని వీడడం లేదు. కొంత కాలంగా వారానికోసారి తాగునీరు సరఫరా అవుతున్నది. అది కూడా గంటసేపు అరకొరగా సరఫరా అవుతుండడంతో స్థానికులు నీటిని పట్టుకునేందుకు పోటీ పడాల్సి వస్తున్నది. గ్రామంలో 50 ఏండ్ల కిందట నిర్మించిన ఫిల్టర్ హౌస్, స్టోరేజ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరాయి. జెన్‌కో పంపుల ద్వారా వస్తున్న నీరు, ఫిల్టర్ హౌస్‌లో రెండు 30 హెచ్‌పీ మోటర్లు ఉన్నాయి. వీటిలో ఒక మోటరు రిపేర్‌కు గురి కాగా.. ప్రస్తుతం ఒక్క మోటర్ మాత్రమే నడుస్తున్నది. పాత ట్యాంక్ నుంచి 70 శాతం నీళ్లు లీకేజీ అవుతూ వృథాగా పోతున్నాయి. కేవలం 30 శాతం నీరు మాత్రమే స్థానికులకు అందుతున్నది. స్టోరేజ్ ట్యాంక్ మరమ్మతులకు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని అధికారుల అంచనా..

**నీటి పారుదల శాఖలో సిబ్బంది కొరత**

నీటిపారుదల శాఖలో 17 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా అందులో 15 మంది ఉద్యోగ విరమణ పొందగా.. ఇద్దరు మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత వేధిస్తుండడం.. నిధుల్లేకపోవడంతో సరిపడా నీటిని సరఫరా చేయడం లేదు. నీళ్లు ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ వనరులు లేవని.. ఒక్క జెన్‌కో ద్వారా సరఫరా అయ్యే నీరే ఆధారం. గతంలో జెన్‌కో 30 హెచ్‌పీ మెటార్ ఇచ్చారు. గత ఎంపీ కోరిక మేరకు జెన్‌కోకు సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.2 కోట్ల నిధులు కేటాయించారు. ప్రస్తుతం సీఎస్ఆర్ ఫండ్స్ కింద ఫిల్టర్‌హౌజ్‌లో రెండు స్టోరేజ్ ట్యాంకులకు రిపేర్ చేయించి రెండు 30 హెచ్‌పీ మోటర్లు గ్రామ పంచాయతీకి అందిస్తే వారానికి మూడ్రోజులైనా గ్రామానికి మంచినీరు సరఫరా అవుతుందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### బడ్జెట్ ఫైల్ పంపించాం

దోమలపెంట ఫిల్టర్ హౌస్‌లో స్టోరేజ్ ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నాయి. సిబ్బంది, నిధుల కొరత ఉన్నదని ఉన్నతాధికారులకు వివరించాం. నిధులు విడుదల చేసేందుకు ఫైల్ సిద్ధం చేసి పంపించాం. మంజూరవగా.. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే సిబ్బందిని కూడా నియమించి నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

**- కే.శశికుమార్, జూనియర్ ఇంజినీర్, నీటిపారుదల శాఖ**

### మాకు సంబంధం లేదు

దోమలపెంటలో మంచినీటి సరఫరాకు మాకు సంబంధం లేదు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలోనే ఉన్నది. మిషన్ భగీరథ పథకం ద్వారానే మేము తాగునీటిని అందిస్తాం. నీటి పారుదల శాఖలో సిబ్బంది కొరత ఉన్నది. దీంతో ప్రజలకు దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇద్దరు ఉద్యోగులను తాగునీటి సరఫరా బాధ్యతలను అప్పగించాం.

**- జయంత్, పంచాయతీ కార్యదర్శి, దోమలపెంట**